క్లుప్తంగా

ఘనంగా పెద్దవేట పండగ



థింసా నృత్యాలు చేస్తున్న గ్రామస్తులు

దుంబ్రిగుడ: మండలంలోని సొవ్వ పంచాయతీ గిరిజన గ్రామాల్లో ఆది, సోమవారాల్లో పెద్దవేట పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులందరూ కలిసి థింసా నృత్యాలు చేయడంతో వివిధ వేషధారణలతో సందడి చేశారు. ఒడియా నాటికలను ప్రదర్శించారు. దీంతో పంచాయతీలో పెద్దవేట పండుగ ఘనంగా ముగిసింది.

కిశోర వికాసంపై అవగాహన



ఐసీడీఎస్ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కిశోర వికాసం కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం ఐసీడీఎస్ కార్యాలయంలో కిశోర వికాసం కార్యక్రమంపై సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వేసవి సెలవుల్లో బాలబాలికలకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బాల్యవివాహాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ వంటి అంశాలను వివరించాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీదేవి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యం కోసం సాయం



ఆర్థిక సాయమందిస్తున్న దాత జమాల్‌ఖాన్

ఎటపాక: అనారోగ్యంతో విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక వైద్య ఖర్చులకు ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ సోమవారం ఆర్థిక సాయం అందించారు. ఎటపాక గ్రామానికి చెందిన అలవాల అంబేడ్కర్ కుమార్తె తపస్వి గతేడాది ద్విచక్రవాహనంపై వస్తుండగా జరిగిన ప్రమాదానికి గురై , బాలిక మెదడులో రక్తం గడ్డకట్టింది. అప్పటి నుంచి హైదరాబాద్ రెయిన్‌బో ఆస్పత్రిలో చిన్నారి చికిత్స పొందుతుంది. నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులకు వారు దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో చిన్నారి కుటుంబ సభ్యులకు రూ.10వేల నగదును జమాల్‌ఖాన్ అందజేశారు.

రైతులకు సూచనలు



మాట్లాడుతున్న ఏఎస్‌వో వెంకట హరికృష్ణ

కూనవరం: టుస్సార్ పట్టు పంట సాగుపై ఈనెల 28 నుంచి మే నెల 3వ తేదీ వరకు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు అసిస్టెంట్ సెరీకల్చర్ ఆఫీసర్ వెంకట హరికృష్ణ తెలిపారు. పట్టుపరిశ్రమ శాఖ చింతూరు డివిజన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మెట్ట రామవరంలో రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టు రైతులు ఏడాదికి మూడు పంటలు సాగుచేయవచ్చని, తద్వారా రూ. 30 వేల నుంచి రూ. 80 వేల వరకు ఆదాయం పొందవచ్చన్నారు. మొదటి పంట జూలై – ఆగస్టు మాసాల్లోను, 2వ పంట సెప్టెంబర్–అక్టోబర్, 3వ పంట నవంబర్–డిసెంబర్ మాసాల్లో సాగు చేస్తే ఆదాయం వస్తుందన్నారు. ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంట కాలంలో వ్యవసాయ పరికరణాలను ప్రభుత్వం అందిస్తుందని, ఏఎస్‌ఓ వెంకట హరికృష్ణ రైతులకు అవగాహన కల్పించారు.

పొంచి ఉన్న ప్రమాదం



తూటంగి వద్ద ప్రమాదకరంగా ఉన్న గోతులు

దుంబ్రిగుడ: మండలంలోని తూటంగి పంచాయతీ నుంచి పెదబయలు, ఒడిశా వెళ్లే రోడ్డులో సెల్‌టవర్ కేబుల్ వైర్ ఏర్పాటు కోసం తవ్విన గోతులు పూడ్చక పోవడంతో ప్రమాదంగా మారాయి. ఈ ప్రాంతంలో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు ఈ మార్గంలో ప్రయాణించేందుకు భయపడుతున్నారు. ఏ మాత్రం ఆదమరిచినా వాహనచోదకులు ప్రమాదాల బారిన పడడం తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తవ్విన గోతులను పూడ్చాలని వారు కోరుతున్నారు.

చింతపండు.. ధర మెండు



సంతలో విక్రయానికి చింతపండు తీసుకొస్తున్న గిరిజన మహిళ

జి.మాడుగుల: గిరిజన ప్రాంత వారపుసంతల్లో చింతపండు హాట్‌కేక్‌లా అమ్ముడవుతుంది. ఈ ప్రాంతం నాణ్యమైన చింతపండుకు కేరాఫ్ అడ్రస్ అని చెప్పవచ్చు. ఈ ఏడాది అన్ని పంటలతో పాటు చింతపండు పంట కూడా బాగా పండింది. చింతపండు పంట దిగుబడితో పాటు ధర కూడా పలకడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ ప్రాంతంలో మార్చి నెల నుంచి మే నెలాఖరు వరకు చింతపండు సీజన్ ఉంటుంది. ఏజెన్సీ ప్రాంతంలోని రైతులు తమ చింతచెట్లుకు పండిన చింతపండు సేకరించి శుభ్రపర్చి గోనె సంచెలు, బుట్టల్లో వారపు సంతలు, మండల కేంద్రాలకు మోత బరువు, కొంతమంది ఆటో వంటి వాహనాల్లో తరలిస్తున్నారు. జి.మాడుగుల, పాడేరు, చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు, పెదబయలు, ముంచంగిపుట్టు, అరకు, అనంతగిరి వారపుసంతల్లో చింతపండు అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి.

మండలంలో 5.4800 హెక్టార్లలో చింతపండు సాగు

రూ.70లక్షల వరకు వ్యాపార లావాదేవీలు

వారపు సంతల్లో డిమాండ్

ఆనందంలో రైతులు



జి.మాడుగుల సంతలో విక్రయించడానికి తీసుకు వచ్చిన చింతపండు

జి.మాడుగుల మండలంలో సంతబయలు గ్రామంలో సంతలో గత వారం చింతపండు నాణ్యతను బట్టి కిలో రూ.55 నుంచి రూ.60వరకు ధర పలికింది. వారపుసంతల్లో చింతపండుకు డిమాండ్ ఉండడంతో రైతులు చెప్పిన ధరలే చెల్లించి వ్యాపారులు, వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. మండలం పలు గ్రామాల్లో 5.4800హెక్టార్లుల్లో చింతచెట్లు ఉన్నట్లు ఈ క్రాప్ లెక్కల ప్రకారం తెలుస్తోంది. 500 మంది రైతులు ఉండగా సుమారుగా 1500 చింతచెట్లు ఉన్నట్టు అంచనా.



గెద్దరాయి గ్రామంలో శుభ్రపర్చిన చింతపండు

ఒక్కో చెట్టు నుంచి సుమారు 80కిలోల నుంచి 100 కిలోల మధ్య చింతపండు పంట దిగుబడి కాగా, 120 నుంచి 130టన్నుల వరకు వస్తుందని రైతులు భావిస్తున్నారు. ఒక్కో చెట్టు ద్వారా పంట దిగుబడిని బట్టి రూ.4,400 నుంచి రూ.6000 వరకు ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. రెండు చెట్ల నుంచి అయిదు చెట్ల వరకు ఉంటే ఆ రైతుకు రూ.9,000 నుంచి రూ.12,000మధ్య ఆదాయం రాగా, మండలంలో గల 500 మంది చింతపండు రైతులకు సుమారుగా రూ.65లక్షలు నుంచి రూ.70లక్షలు వ్యాపార లావాదేవీలు జరిగినట్టు రైతుల అంచనా. చింతపండు పంటకు చేతికి రావటానికి ఎటువంటి వ్యవసాయ ఖర్చులు ఉండవని చెట్టు నుంచి సేకరించినప్పుడు, శుభ్రపర్చినప్పుడు మాత్రమే రూ.500 నుంచి రూ.1000 వరకు ఖర్చువుతుందని రైతులు చెబుతున్నారు. చింతపండుకు మార్కెట్‌లో మంచి డిమాండ్‌తో పాటు ధర పలుకుతుండడంతో రైతుల కళ్లల్లో ఆనందం వ్యక్తమవుతుంది.



మైదాన ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధం చేస్తున్న చింతపండు బస్తాలు

ఆశాజనకంగా దిగుబడి



ఈ సంవత్సరం చింతచెట్లు నుంచి బాగానే దిగుబడి వచ్చింది.దీనికి వ్యవసాయ ఖర్చులు ఉండవు. చెట్టు నుంచి చింతపండు సేకరించటానికి, శుభ్రపర్చడానికి మాత్రమే ఖర్చువుతుంది. పెట్టుబడి లేని పంట చింతపండు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది దిగుబడి బాగానే వచ్చింది. ఒక చెట్టు ఉండగా 100 కిలోల వరకు చింతపండు పంట దిగుబడి వచ్చింది.

–దేముళ్లునాయుడు,
రైతు, గొడ్డుబూసులు గ్రామం, జి.మాడుగుల

సంతోషంగా ఉంది



వారపు సంతలో చింతపండుకు మార్కెట్ ధర బాగుంది.రైతుకు ధర గిట్టుబాటవుతుంది. చింతపండుకు డిమాండ్‌తో పాటు ధర పలుకుతుండటంతో చాలా సంతోషంగా ఉంది. రెండు చెట్టు నుంచి ఇంటి ఖర్చు కొంత ఉంచుకొని మిగతా 180 కిలోల చింతపండును వారపు సంత తరలించి విక్రయించగా రూ.9వేల ఆదాయం వచ్చింది. చాలా సంతోషంగా ఉంది.

– రాజుబాబు,
రైతు, గడుతూరు గ్రామం, జి.మాడుగుల

బంద్‌ను విజయవంతం చేయాలి



కొయ్యూరులోని సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నేతలు, ఆదివాసీ సంఘం నేతలు

కొయ్యూరు: గిరిజనుల కోసం ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని మే 2న చేపట్టనున్న బంద్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాలు, వివిధ పార్టీల నేతలు కోరారు. ఇక్కడ గిరిజన్ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, డౌనూరు ఎంపీటీసీ బిడిజన అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక డీఎస్సీ ప్రకటించకుండా అందరితో కలిసి సాధారణ డీఎస్సీ ఇవ్వడం దారుణమన్నారు. ఆదివాసీ అభ్యర్థుల పట్ల ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ చేపట్టనున్న బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు నర్సి కృష్ణ, గిరిజన ఉద్యోగుల సంఘం నేత పాపారావు, సీపీఎం, సీపీఐ నాయకులు సూరిబాబు, దేముడు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు రూరల్: పాడేరు ఐటీడీఏ వద్ద ఈనెల 30న నిర్వహిస్తున్న ధర్నా, మే 2న జరిగే మన్యం బంద్‌లు విజయవతం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు, సోమవారం గిరిజన ఉద్యోగుల భవన్‌లో ప్రజా సంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ కన్వీనర్ పలాసి శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్‌తో ఆదివాసీ అభ్యర్థులకు ఎటువంటి ఉపయోగం లేదన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబునాయుడు ప్రకటించిన జీవో నెంబరు–3 పునరుద్ధరణ హామీని నేటి వరకు అమలుచేయలేదన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆదివాసీ అభ్యర్థుల కోసం స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలన్నారు. ఏజెన్సీలో ఖాళీగా ఉన్న పోస్టులను గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేయాలన్నారు. ఈ మేరకు ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ ఆదివాసీ ప్రజా సంఘాల తరపున చేపట్టనున్న ధర్నా, బంద్ కార్యక్రమాలకు అందరూ మద్దతు ప్రకటించి విజయవంతం చేయాలని కోరారు. నాయకులు రాజాబాబు, నాగేశ్వరరావు, చిరంజీవి, రాధాకృష్ణ, ప్రశాంత్‌కుమార్, కొర్రా చిన్నారి, బాలరాజు పాల్గొన్నారు.



పాడేరులోని సమవేశంలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

మే 4 నుంచి అమ్మవార్ల ఉత్సవాలు



కిల్లమాంబ అమ్మవారి

జి.మాడుగుల: ఆంధ్రా– ఒడిశా రాష్ట్ర సరిహద్దు గిరిజన గ్రామాల ఆరాధ్య దైవం భక్తుల కోర్కెలు తీర్చే అమ్మ కిల్లంకోట గ్రామంలో కొలువై ఉన్న కిల్లమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమై, మూడు రోజుల పాటు జరుగుతాయి. కిల్లమాంబ అమ్మవారి జాతర సందర్భంగా వాలీబాల్ పోటీలు నిర్వహించి విజేత టీమ్‌లకు ప్రథమ బహుమతి రూ.10,016 నగదుతో పాటు షీల్డు, ద్వితీయ బహుమతి రూ. 5,016 నగదుతో షీల్డ్, తృతీయ బహుమతి రూ.3,016 నగదుతో పాటు షీల్డులు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. వాలీబాల్ పాల్గొనే టీమ్‌లు ప్రవేశ రుసుము రూ.600 ఈ నెల 29లోగా చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9381779782, 6300217748 నంబర్లును సంప్రదించాలని పేర్కొన్నారు. పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో లైటింగ్, సౌండ్స్‌కు కిల్లంకోట ఉద్యోగులు, చివరి రోజు నారీ మెగా ఈవెంట్ ప్రోగ్రాన్ని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలకు స్థానిక ఆర్థిక సహకారంతో అతి వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది.



ఎల్లమ్మ అమ్మవారి

అడ్డతీగల: వేటమామిడిలో వెలసిన చిన్నమస్తా రేణుకా ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవాలు మే 4 నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకుడు ముర్ల రాజారెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ఈశ్వరుడికి అభిషేకం, మహా గణపతి హోమం గావిస్తామన్నారు.5వ తేదీన 108 మంది సుమంగళి స్త్రీలకు వాయిన ప్రదానం చేస్తామన్నారు. కాళి నృత్యాల నడుమ అమ్మవారి జాతర వైభవోపేతంగా జరుపుతామన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధననిర్వహిస్తామన్నారు. జాతర చివర్లో చిన్నమస్తా రేణుకా ఎల్లమ్మ మహా కుంభ బలి పూజ జరుగుతుందన్నారు.

5న మర్రి కామయ్య వర్ధంతి

హుకుంపేట: ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు మర్రి కామయ్య వర్ధంతిని వచ్చే నెల 5న ఘనంగా నిర్వహించనున్నట్టు మర్రి కామయ్య ఆశయ సాధన సమితి అధ్యక్షుడు కొర్ర కృష్ణమూర్తి, కార్యదర్శి పాంగి అప్పారావు తెలిపారు. వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. కామయ్యపేటలోని మర్రి కామయ్య సమాధి వద్ద వర్ధంతి వేడుకలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, గిరిజనులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కొటిబాబు, శంకర్‌రావు, రామరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బైక్ నుంచి చెలరేగిన మంటలు



బైక్ నుంచి వస్తున్న మంటలు

రంపచోడవరం: రంపచోడవరం యూనియన్ బ్యాంకు వద్ద పార్క్ చేసిన మోటార్ బైక్ ఇంజన్ నుంచి ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఇంజన్ నుంచి బ్యాటరీకి అధికంగా వేడి రావడంతో షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు వ్యాపించినట్టు స్థానికులు తెలిపారు. బైక్ నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో జనం పరుగులు తీశారు. స్థానిక యువకులు మంటలను అదుపు చేశారు. బైక్ పాక్షికంగా దెబ్బతింది.

ప్రభుత్వం దృష్టికి గ్రామాల సమస్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ సరస్వతి

వి.ఆర్.పురం: గిరిజనుల సమస్యలపై ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు, వార్డు సభ్యులు, గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం సోమవారం నిర్వహించారు. తహసీల్దార్ సరస్వతి, ఇన్‌చార్జి ఎంపీడీవో రామాంజనేయ ప్రసాద్, సీడీపీవో నాగలక్ష్మి, వెలుగు ఏపీఎం దుర్గాప్రసాద్, స్వచ్ఛంద సంస్థ అధినేత ఉండవల్లి గాంధీబాబు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సమస్యలు, పోడు భూముల సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు వినతులు అందజేశారన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వివిధ సమస్యలపై బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతికి సంతాపం

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగిలో ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందిన సింగిరెడ్డి బాబ్జీ (70)కి మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్‌లు తమ సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు సోమవారం జడ్డంగి వచ్చి బాబ్జీ కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. బాబ్జీ వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి రామకృష్ణకు సోదరుడు, అలాగే మరో సీనియర్ నాయకుడు సింగిరెడ్డి రవికి తండ్రి. మృతుడి కుటుంబీకులను పరామర్శించిన వారిలో సర్పంచ్‌లు కొంగర బాబ్జీదొర, సవిరెల చంద్రుడు, చీడి శివ, దాసరి నాగేశ్వరరావు, నాయకులు వీరబాబు, జాన్‌బాబు, వెంకటరమణ, కుశరాజు, ముసలయ్య, వెంకటరావు, సత్యనారాయణ తదితరులున్నారు.



బాబ్జీ కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

చినుకు పడితే చిత్తడే

- అధ్వానంగా సంతలో దారులు
- ఇబ్బందులు పడుతున్న గిరిజనులు
- చోద్యం చూస్తున్న అధికారులు

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని వారపు సంతలో దారులు అధ్వానంగా ఉన్నాయి. చినుకు పడితే చిత్తడిగా దర్శనమిస్తున్నాయి. దీంతో సంతకు వచ్చేవారు నడిచేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ప్రతి శుక్రవారం జరిగే వారపు సంత కోట్ల రూపాయల్లో వ్యాపారం జరుగుతున్నా ఈ ప్రదేశంలో కనీసం సీసీ రోడ్డు వేయకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసిన బురద మయంగా మారుతుంది. వారపు సంత నిర్వహణతో ఆశీల రూపంలో పంచాయతీకి లక్షల రూపాయల నిధులు సమకురుతున్నా పంచాయతీ అధికారులు కనీసం స్పందించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



అరకు వారపు సంతలో బురదతో చిత్తడిగా మారిన ప్రాంతం

నిరుపయోగంగా బోర్లు

- గ్రామంలో తాగునీటి కష్టాలు
- పట్టించుకోని అధికారులు



తుప్పల నడుమ నిరుపయోగంగా దర్శనమిస్తున్న బోరు

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని తాగునీరు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే గ్రాంట్ ద్వారా మూడు బోర్లు, జల్‌జీవన్ మిషన్ ద్వారా ఒక బోరును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మండల కేంద్రంలోని ఆస్పత్రి వద్ద, గ్రంథాలయం వద్ద ఉన్న రెండు బోర్లు నుంచి మోటార్ ద్వారా ట్యాంకులోకి పంపింగ్ చేసి అక్కడి నుంచి తాగునీరు అందిస్తున్నారు. అయితే గుంటసీమ రోడ్డుకు రెండు వైపులా ఉన్న బోర్లు ఒకటి నిరుపయోగంగా దర్శనం ఇస్తుంటే మరోకటి హెడ్ పాడైపోయి పనికిరాకుండా ఉంది. దీంతో లక్షల ప్రజాధనం వృథాగా పోతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. మండల అధికారులు స్పందించి నిరుపయోగంగా బోరింగులను ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.



హెడ్ పాడై వినియోగంలో లేని బోరు

ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని ధర్నాలు

పాడేరు రూరల్: ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ తక్షణమే ప్రకటించి అర్హులైన ఆదివాసీ నిరుద్యోగులతో ఏజెన్సీలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతు కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఆదివాసీలకు ఇచ్చిన అమలు చేయకుండా కాలయాపన చేయడం సిగ్గుచేటన్నారు.

అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా స్పెషల్ డీఎస్సీ ఊసేలేదన్నారు. డీఎస్సీ ప్రకటించి ఆదివాసీ అభ్యర్థులను తీవ్రంగా మోసం చేశారన్నారు. తక్షణమే 5వ షెడ్యూల్ గిరిజన ప్రాంతంలో ఆదివాసీలకు వందశాతం ఉద్యోగాలు కల్పించాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వంపై ఆదివాసీల వ్యతికరేకత మొదలైందని భవిష్యత్తులో చేపట్టునున్న ఉద్యమాలకు అందరూ ముందుకురావాలని పిలుపునిచ్చారు. కృష్ణ, బాలు, జగదీష్, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

రంపచోడవరం: గిరిజన ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మారేడుమిల్లిలో ఆందోళన నిర్వహించారు. వై.జంక్షన్ దగ్గర నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఏజెన్సీలో గిరిజనులకు వందశాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ గొర్లె బాలాజీ బాబు మాట్లాడుతూ జీవో నెంబర్ 3ను వెంటనే పునరుద్ధరించాలన్నారు, తక్షణమే ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలన్నారు.



మారేడుమిల్లిలో ఆందోళన చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు